క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీల్లో రాణించండి


జిల్లా బాలికల జట్టును అభినందిస్తున్న క్రీడాసంఘం చైర్మన్

ఉరవకొండ: కర్నూలు జిల్లా నందికొట్కూరులో జరిగిన రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీల్లో బాలికల విభాగంలో అనంతపురం జిల్లా జట్టు విజేతగా నిలిచింది. ఉరవకొండ లయన్స్ క్లబ్ కార్యాలయంలో జిల్లా సెపక్‌తక్రా సంఘం చైర్మన్ సప్తగిరి మల్లికార్జున ఆధ్వర్యంలో విజేత జట్టు సభ్యులను ఘనంగా సత్కరించారు. చైర్మన్ మాట్లాడుతూ జిల్లా బాలికల జట్టు మొదటిసారి రాష్ట్రస్థాయి విజేతగా నిలవడం గర్వకారణమన్నారు. త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో కూడా జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికైన క్రీడాకారులు క్రీడా నైపుణ్యత ప్రదర్శించాలన్నారు. అనంతరం క్రీడాకారులకు జ్ఞాపికలు బహూకరించారు. కార్యక్రమంలో పీడీ మారుతి, లయన్స్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఉదయం 8 గంటల నుంచి ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈశ్వరరెడ్డి శుక్రవారం తెలిపారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, బ్రాహ్మణి సోషల్ వెల్ఫేర్, రూరల్ డెవలప్‌మెంట్, ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే వైద్య శిబిరం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్ కాపురామచంద్రారెడ్డి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి విచ్చేస్తారన్నారు. గ్రామీణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

బొమ్మనహాళ్: పదో తరగతి పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఎంఈఓ తిమ్మప్ప సూచించారు. శుక్రవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో మండలంలోని ప్రధానోపాధ్యాయులకు సమావేశం నిర్వహించారు. ఏప్రిల్ 3 నుంచి 10వ తరగతి పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు, ఇబ్బందులు ఎదురుకాకుండా పరీక్షలు జరుగుతాయని, అందరూ సహకరించాలన్నారు. బొమ్మనహాళ్‌లో నాలుగు సెంటర్లలో పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

నేటి నుంచి రససిద్దేశ్వర స్వామి ఉత్సవం

రాయదుర్గంటౌన్: రాయదుర్గం సిద్దప్ప కొండపై వెలసిన శ్రీరస సిద్దేశ్వరస్వామి ఉత్సవాలు ఈ నెల 25, 26 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. శనివారం సాయంత్రం 5 గంటలకు స్వామి రథోత్సవం, ఆదివారం సాయంత్రం 5 గంటలకు సిడిమాను ఉత్సవం జరుగుతుందన్నారు. భక్తులు విచ్చేసి పూజలు చేసి మొక్కులు తీర్చుకోవాలన్నారు.

యువకుడికి గాయాలు

కళ్యాణదుర్గం: మండలంలోని పాలవాయి గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసుల వివరాల మేరకు... కంబదూరు మండలం పి. వెంకటంపల్లికి చెందిన కురుబ మంజునాథ్ ద్విచక్రవాహనంలో కళ్యాణదుర్గం నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. పాలవాయి వంక వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న మరో బైకు ఢీకొంది. ఘటనలో మంజనాథ్ కుడికాలుకు ఫ్యాక్చర్ అయ్యింది. స్థానికులు అతడిని కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విప్ సొంత నిధులతో వీధి దీపాల ఏర్పాటు


17వ వార్డులో ఏర్పాటు చేస్తున్న ఎల్‌ఈడీ లైటు

రాయదుర్గంటౌన్: ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి సొంత నిధులు రూ.3 లక్షలు వెచ్చించి 170 ఎల్‌ఈడీ వీధి దీపాలను పట్టణంలోని అన్ని వార్డుల్లో ఏర్పాటు చేయిస్తున్నారు. ఇటీవల రూ. 4 లక్షల పురపాలక సంఘం సాధారణ నిధులతో 150 వీధిదీపాలు ఏర్పాటు చేయగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పలు వార్డుల్లో వీధి దీపాల కొరత ఉందని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఆయా వార్డుల్లో సొంత నిధులతో లైట్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో రూ. 3 లక్షల వ్యయంతో 20 వ్యాట్స్ సామర్థ్యం గల 150 వీధీ పాలతోపాటు 50 వ్యాట్స్ సామర్థ్యం గల మరో 20 లైట్లు మున్సిపాలిటీకి ప్రభుత్వ విప్ సమకూర్చారు. సరఫరా చేసిన లైట్లను ఒక్కో వార్డుకు 5 చొప్పున ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది అవసరమైన చోట్ల ఏర్పాటు చేస్తున్నారు. వార్డు కౌన్సిలర్లు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

డ్వాక్రా మహిళలకు తీపి కబురు

- రేపటి నుంచి 'వైఎస్సార్ ఆసరా' సొమ్ము పంపిణీ
- ఏప్రిల్ 5 వరకూ ఉత్సవాలు


మురడిలో డ్వాక్రా సభ్యులతో సమావేశమైన వైకేపీ సిబ్బంది

రాయదుర్గం: డ్వాక్రా అక్క,చెల్లెమ్మలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీపి కబురందించారు. వైఎస్సార్ ఆసరా పథకం కింద మూడో విడత నిధులు జమ చేసేందుకు కార్యచరణ సిద్ధం చేశారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని మొత్తం 11,576 డ్వాక్రా సంఘాల్లోని 1,14,249 మంది సభ్యులు రుణమాఫీకి అర్హత సాధించారు. వీరందరి ఖాతాల్లో ఈ నెల 26 నుంచి వచ్చే నెల 5 వరకు వైఎస్సార్ ఆసరా వారోత్సవాలు నిర్వహించి రూ.75.19 కోట్ల మొత్తం డబ్బును రాష్ట్ర ప్రభుత్వం జమ చేయనుంది. ఇప్పటికే గడిచిన రెండు విడతల్లోనూ రూ.149.16 కోట్ల మొత్తాన్ని అందించారు. ఈ నేపథ్యంలో మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కి అన్నీ వేళలా రుణపడి ఉంటామంటూ భరోసానిస్తున్నారు. 2019లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించాక అక్కచెల్లెమ్మలకు అండగా నిలిచారు. చంద్రబాబు పుణ్యాన నిర్వీర్యదశకు చేరిన డ్వాక్రా సంఘాలకు పూర్వ వైభవం తీసుకొచ్చారు. వైఎస్సార్ ఆసరా పథకం అమలుతో కొండత భరోసానిచ్చారు.

27 నుంచి వైఎస్సార్ ఆసరా వారోత్సవాలు

కళ్యాణదుర్గం: ఈ నెల 27 నుంచి వైఎస్సార్ ఆసరా వారోత్సవాలను నిర్వహించనున్నట్లు వైఎస్సార్ క్రాంతి పథకం ఏరియా కో ఆర్డినేటర్ రాధారాణి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 27న కంబదూరు జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఆవరణ, 28న కుందుర్పి మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవనం, 29న శెట్టూరులోని ఎంపీపీ పాఠశాల, 31న బ్రహ్మసముద్రం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల, ఏప్రిల్ 1న కళ్యాణదుర్గం మార్కెట్ యార్డులో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఆయా కార్యక్రమాలకు రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ హాజరవుతారన్నారు.

మహిళల సంక్షేమానికి పెద్దపీట

వజ్రకరూరు: మహిళల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేసినట్లు వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి వెంకటరెడ్డి, ఎంపీపీ రమావత్‌దేవి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో వైఎస్సార్ ఆసరా సంబరాల సభా స్థలాన్ని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీనాయకులు పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచు మోనాలిసా, ఎఫ్‌పీఓ చైర్మన్ అమర్‌నాథ్, జేసీఎస్ మండల కన్వీనర్ రాచన్నగౌడ్, ఉ పాధ్యక్షుడు ఉస్మాన్, బీసీ సెల్ కార్యదర్శి వీరభద్రగౌడ్, ఎంపీటీసీ రామక్రిష్ణ, వైకేపీ ఏపీ ఎం గుణశ్యాం తదితరులు పాల్గొన్నారు. కాగా వజ్రకరూరు మండలంలో 724 సంఘాల్లోని 7,355మంది సభ్యులకు వైఎస్సార్ ఆసరా మూడో విడత రూ.4. 89 కోట్లు జమ కానున్నట్లు వైకేపీ ఏపీఎం తెలిపారు.

మూడో విడత పంపిణీ ఇలా..

నియోజక వర్గం	సంఘాలు	సభ్యుల సంఖ్య	జమ చేయనున్న మొత్తం(రూ.కోట్లలో)
రాయదుర్గం	3,707	36,912	22.66
కళ్యాణదుర్గం	4,058	40,046	24.77
ఉరవకొండ	3,811	37,291	27.76

సంతోషంగా ఉంది



మాది సాయిబాబా సంఘం. 2019 ఏప్రిల్ నాటికి రూ.2,96 లక్షలు బ్యాంకు లింకేజీ ద్వారా బకాయి పడ్డాం. వైఎస్సార్ ఆసరా పథకం అమల్లోకి రావడం ద్వారా ఆ మొత్తంకు దశల వారీగా రుణమాఫీ జరిగింది. ఒక్కో విడతకు రూ.70,000 చొప్పున ఇప్పటికే రెండు విడుతల్లో రూ.1.40 వేలు సంఘంలోని 10 మంది సభ్యులకు ఒక్కొక్కరికి రూ. 14,800 ప్రకారం ఖాతాల్లోకి చేరాయి.

–టి.అనంతమ్మ, సాయిబాబ సంఘం, మురడి

షెడ్యూల్ తయారు చేశాం

వైఎస్సార్ ఆసరా వారోత్సవాలకు సంబంధించిన షెడ్యూల్‌ను తయారు చేశాం. ఈ నెల 26న డి హీరేహాళ్, 27న బొమ్మనహాళ్, ఏప్రిల్ 2న రాయదుర్గం అర్బన్/మండలం, 3న కణేకల్లు, 4న గుమ్మఘట్టలో సంబరాలు నిర్వహించతలపెట్టాం. ఈ కార్యక్రమాల్లో మహిళలను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేసేలా చర్యలు తీసుకుంటాం.

– గంగాధర, వైకేపీ ఏసీ, రాయదుర్గం

రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం


రాయదుర్గం టౌన్: దర్గామసీదులో మొదటి రోజు ఇఫ్తార్‌లో పాల్గొన్న ముస్లిం సోదరులు


ఉరవకొండ:ఫాతీమా మసీదులో ముస్లింలకు ఇఫ్తార్ విందు వడ్డిస్తున్న పార్టీ నాయకులు మల్లి

రాయదుర్గంటౌన్: ముస్లింలకు పవిత్రమైన రంజాన్ మాసం శుక్రవారం నుంచి భక్తిశ్రద్ధలతో ప్రారంభమైంది. ఐదు పూటలా నమాజ్, సాయంత్రం ఇఫ్తార్ కార్యక్రమాలతో మసీదుల్లో ఆధ్యాత్మిక సంతరించుకుంది. నెలరోజుల పాటు ఉప వాస దీక్షలు, దైవ చింతన ద్వారా ఏడాది అంతా శుభం కలుగుతుందని ముస్లింల విశ్వాసం.

ఇఫ్తార్ విందు

ఉరవకొండ: స్థానిక శివరామిరెడ్డి కాలనీలోని ఫాతీమా మసీదు ఆవరణలో పవిత్ర రంజాన్ మాసం మొదటి ఉపవాస దీక్షను పురస్కరించుకుని శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకుడ, 15వ వార్డు సభ్యుడు వశికేరి మల్లికార్జున ఆధ్వర్యంలో ఇఫ్తార్‌విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కన్వీనర్ బ్యాంకు ఓబుళేసు, వైస్ ఎంపీపీ నరసింహులు, జెడ్పీ మాజీ సభ్యుడు తిప్పయ్య, ఎంపీటీసీ ఈడిగ ప్రసాద్, బూదగవి ధనంజయ, వాణి విద్యాసంస్థల అధినేత రఘురాములు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో నిబంధనలు పాటించాలి


వివరాలు వెల్లడిస్తున్న తనిఖీ బృందం

వజ్రకరూరు: ఉపాధి పథకంలో నిబంధనలు తప్పక పాటి చాలని డిస్ట్రిక్ట్ విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, డ్వామా అడిషినల్ పీడీ, ప్రిసైడింగ్ అధికారి సుధాకర్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో 16వ సామాజిక తనిఖీ ఓపెన్ ఫోరం నిర్వహించారు. 2021 ఏప్రిల్ 1 నుంచి 2022 మార్చి 31 వరకూ మండలంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ఉపాధి పనులకు రూ.10,77,24,778 ఖర్చు పెట్టారు. ఇందులో రూ.2,59,176 రికవరీకి సిఫార్సు చేసినట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రమావత్‌దేవి, సర్పంచులు మోనాలిసా, సురేంద్ర, ఎంపీటీసీలు పాపన్న, మునయ్య, స్టేట్ రిసోర్స్‌పర్సన్ తులసీనాయక్, ఏపీఓ వెంకటేష్‌నాయక్, సీనియర్ డీఆర్పీ చెన్నయ్య, జేసీఎస్ మండల కన్వీనర్ రాచన్న గౌడ్, ఈసీ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

శెట్టూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ గంగావతి శుక్రవారం తెలిపారు. అయ్యగార్లపల్లి1– ఓసీ(జనరల్), లక్ష్మంపల్లి1 – బీసీ (జనరల్), కనుకూరు 1 – బీసీ(జనరల్), 1 బీసీ(మహిళ), యాటకల్లు 2లో 1 బీసీ(జనరల్) పోస్టులకు ఈ నెల 31 వరకూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులకు ఏప్రిల్ నుంచి 4 వ తేదీ వరకు మౌఖిక పరీక్ష ఉంటుందన్నారు.

రాయదుర్గం రూరల్: మండలంలోని 74 ఉడేగోళం, చదం గొల్లలదొడ్డి గ్రామాల్లో ఒక్కొక్కటి చొప్పున ఖాళీగా ఉన్న రెండు వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ కొండయ్య శుక్రవారం తెలిపారు. 74 ఉడేగోళం గ్రామంలో ఎస్సీ జనరల్, చదం గొల్లలదొడ్డి గ్రామంలో బీసీ జనరల్ అభ్యర్థులకు కేటాయించామన్నారు.

బ్రహ్మసముద్రం: మండలంలోని బ్రహ్మసముద్రంలో– 2 , వేపులపర్తి –2 , పిల్లలపల్లి –3 వలంటీర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేశారు. అర్హులు మార్చి 31లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఎంపీడీఓ వెంకటనాయుడు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

క్షయవ్యాధిపై అప్రమత్తత అవసరం

ఉరవకొండ రూరల్/రాయదుర్గంటౌన్/బొమ్మనహాళ్: క్షయవ్యాధిపై అప్రమత్తత అవసరమని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ వెంకటేష్ అన్నారు. ఉరవకొండ మండలంలోని ఆమిద్యాల గ్రామంలో శుక్రవారం డాక్టర్ వెంకటేష్ ఆధ్వర్యంలో క్షయ వ్యాధి నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమం సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అలాగే రాయదుర్గంలోని ఏరియా ఆస్పత్రి వద్ద క్షయ అవగాహన ర్యాలీని వైద్యాధికారులు ప్రారంభించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ మాధవి, టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ రమేష్, వైద్యులు జ్ఞానసుధ, శ్రీలత, టీబీ యూనిట్ ల్యాబ్ సూపర్‌వైజర్ సత్యనారాయణ, టెక్నీషియన్ సురేష్, శ్రీకాంత్‌నాయక్, శశికళావతి, ఐసీటీసీ కౌన్సిలర్ కృష్ణమూర్తి, అల్తాఫ్, నర్సింగ్ హెడ్ రమణమ్మ, సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా బొమ్మనహాళ్, శ్రీధరఘట్ట ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. వైద్యాధికారిణి గీతాభార్గవి, హెల్త్ ఎడ్యుకేటర్ విజయభారతి, హెల్త్ సూపర్‌వైజర్ యుగంధర్, ఆరోగ్య కార్యకర్తలు గోవర్ధన, రమణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం


కూడేరు: సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వాల్మీకులు

కూడేరు/ఉరవకొండ/బెళుగుప్ప: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని బోయలు, వాల్మీకులు హర్షం వ్యక్తం చేశారు. ఎస్టీ జాబితాల్లో చేర్చేందుకు శుక్రవారం అసెంబ్లీలో సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలో తీర్మానం చేయడంతో కూడేరులో బోయ, వాల్మీకులు సంబరాలు జరుపుకున్నారు. ఆనందంతో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ఎస్టీ జాబితాలో చేర్చుతామని హామీలిచ్చారే తప్పా ఆ దిశగా చర్యలు చేపట్టింది లేదన్నారు. సీఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం అసెంబ్లీలో తీర్మానం చేయడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో వాల్మీకులు తోపుదుర్తి రామాంజనేయులు, కొండపల్లి రాజశేఖర్, రామదుర్గం క్రిష్టప్ప, శివరావు, ప్రతాప్, ఓబుళపతి, తిప్పయ్య, సుబ్బయ్య, నరసింహులు, రమణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే రాష్ట్రంలోని బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలంటూ శాసనసభలో ఏకగ్రీవంగా తీర్మానించి కేంద్రానికి బిల్లు పంపడంతో శుక్రవారం ఉరవకొండ నియోజకవర్గ వాల్మీకులు హర్షం వ్యక్తం చేశారు. వాల్మీకి సంఘం నాయకులు ముండాసు ఓబుళేసు, హవళిగి ఓబుళేసు, ముస్టూరు చంద్ర, మల్లికార్జున, సురేష్ మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలంటూ ఏకగ్రీవంగా తీర్మానించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలకు ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా బెళుగుప్పలో వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ తలారి రామాంజనేయులు, వాల్మీకి సంఘం మండల నాయకులు మాట్లాడుతూ పాదయాత్రలో చెప్పిన మాట మేరకు శాసనసభలో తీర్మానం చేసినందుకు సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం మండల నాయకులు రమేష్, మచ్చన్న, పురుషోత్తంరాజు, ఉమాపతి, పాతన్న, అంగడి ఎర్రిస్వామి, నరిగన్న పాల్గొన్నారు.

శిక్షణ ఇచ్చి ...ఉపాధి కల్పిస్తాం


మాట్లాడుతున్న చేనేత, జౌళి శాఖ ఏడీ అప్పాజి

రాయదుర్గం రూరల్: చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం జీన్స్ ప్యాంట్ల తయారీలో ఉచితంగా ఇస్తున్న కుట్టు శిక్షణను యువతులు సద్వినియోగం చేసుకోవాలని చేనేత, జౌళి శాఖ ఏడీ శ్రీరంగం అప్పాజీ సూచించారు. మండలంలోని 74 ఉడేగోళం టెక్స్ టైల్ పార్క్‌లో శుక్రవారం ఉచిత కుట్టు(గార్మెంట్) నైపుణ్య శిక్షణలో భాగంగా మొదటి బ్యాచ్ శిక్షణ కార్యక్రమాన్ని అభివృద్ధి అధికారి బసవరాజుతో కలసి ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ టెక్స్‌టైల్ పార్క్‌లో మొత్తం 55 యూనిట్ల ఏర్పాటుకు వ్యాపారులకు ప్లాట్లు కేటాయించామన్నారు. అయితే ఇప్పటి వరకు కేవలం 7 యూనిట్లు మాత్రమే ప్రారంభమయ్యాయన్నారు. వర్కర్ల సమస్యను అధిగమించడంతో పాటు యువతకు స్వయం ఉపాధి కల్పించడం కోసం నైపుణ్య శిక్షణను ప్రారంభించామన్నారు. ఈ శిక్షణ ద్వారా 30 రోజులకు ఒక బ్యాచ్ వంతున స్కిల్ లేబర్స్‌ను తయారు చేసి, యూనిట్లలో ఉపాధి కల్పిస్తామన్నారు. శిక్షణకు వచ్చే వారికి ఉచిత రవాణా సౌకర్యంతో పాటు మధ్యాహ్న భోజనం ఉంటుందన్నారు. సూపర్‌వైజర్ కం ట్రైనర్ హేమంత్ , శిక్షకురాలు గీత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో గార్మెంట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, చమ్మా ఇబ్రహీం, ట్రైనర్ కం యూనిట్ యజమాని ఇబ్రహీం కలీలుల్లా, టెక్స్‌టైల్ పార్క్ మేనేజర్ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్‌కు నివాళి


సీనియర్ జర్నలిస్టు శ్రీనాథ్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ: సీనియర్ జర్నలిస్ట్, ఏపీ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డికి మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి నివాళులర్పించారు. ఈ నెల 22న అనారోగ్యంతో హైదరాబాద్‌లో శ్రీనాథ్ రెడ్డి మృతి చెందిన విషయం విదితమే. వైఎస్సాఆర్ జిల్లా సింహాద్రిపురం మండలం కోవరంగుట్టపల్లికి మాజీ ఎమ్మెల్యే వెళ్లి శ్రీనాథ్‌రెడ్డి మృతదేహన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. దాదాపు నాలుగు దశాబ్దాలు జర్నలిస్టుగా పనిచేసిన శ్రీనాథ్‌రెడ్డితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన వెంట బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ రమణ, భరత్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

వైభవంగా పాతప్ప దేవర ఉత్సవాలు

గుమ్మఘట్ట: మండలంలోని రంగచేడు గ్రామంలో పాతప్ప దేవర ఉత్సవాలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. స్వామి ఉత్సవ విగ్రహాన్ని గ్రామసమీపంలోని వేదావతి హగరికి తీసుకెళ్లి పవిత్ర గంగా జలంతో అభిషేకించి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పోతురాజులు నాట్యమాడుతూ ఊరేగింపుగా వెళ్లి పాతప్ప దేవాలయం వద్ద మేకపోతును గావులు నిర్వహించారు. మాజీ ఎంపీపీ యశోదమ్మ, ఎంపీటీసీ మారెక్క, బోయ శివ, గ్రామస్తులు పాల్గొన్నారు.

అక్కమాంబ జాతర

కంబదూరు: ఉగాది పండగ మరుసటి రోజున నిర్వహించే అక్కమాంబ జాతర శుక్రవారం వైభవంగా జరిగింది. స్థానిక చెరువు కట్ట కింద వెలసిన అక్కమాంబ ఆలయానికి మాజీ ఎంపీటీసీ వడ్డే వెంకటప్ప కుటుంబీకులు రాగి కడవలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. జాతరకు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారికి పూజలు నిర్వహించారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

కూడేరు: మండల పరిధిలోని కలగళ్లలో వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి శుక్రవారం కావడి సుబ్రమణ్యంస్వామి నేతృత్వంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ భూమి పూజ నిర్వహించారు. సుమారు 400 ఏళ్ల క్రితం గ్రామ సమీపాన నిర్మించిన వేంకటేశ్వర స్వామి ఆలయం పాతబడి పూజలకు నోచుకోకుండా ఉండేది. నూతన ఆలయాన్ని నిర్మించాలని గ్రామస్తులంతా సంకల్పించారు. కావడి స్వామి ఆధ్వర్యంలో 108 గ్రామాల్లో భిక్షాటన చేసి విరాళాలు సేకరించారు. భక్తుల సహకారంతో ఆలయాన్ని నిర్మించేందుకు కృషి చేస్తామని కావడి సుబ్రమణ్యం స్వామి తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

5న చలో ఢిల్లీ

రాయదుర్గంటౌన్/కళ్యాణదుర్గం: సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో ఏప్రిల్ 5న చేపడుతున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, సీఐటీయూ రాష్ట్ర నాయకుడు నాగభూషణం, కరువు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య కోరారు. చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం రాయదుర్గం, కళ్యాణదుర్గంలో నిర్వహించినజీపుజాతలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు అచ్యుత్ ప్రసాద్, నాయకులు నాగరాజు, శంకర్, తిమ్మరాజు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు బంగి శివ, లోకేష్, వంశీ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

మంత్రి కృతజ్ఞతలు


ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం: బోయ, వాల్మీకి కులస్తులను ఎస్టీ జాబితాలో, దళిత క్రిస్టియన్లను ఎస్సీ జాబితాలోకి చేర్చాలని అసెంబ్లీలో తీర్మానించిన అనంతరం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, ఎమ్మెల్సీలు మంగమ్మ, డాక్టర్ మధుసూదన్‌తో కలసి ఆమె ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందజేశారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

ఉరవకొండ: స్థానిక కేజీబీవీలో ఆరో తరగతి ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.ధనలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2023–24 కు ఆరో తరగతిలో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈనెల 27 నుంచి ఏప్రిల్ 20లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనాథలు, బడిబయట పిల్లలు, బడి మానేసినవారు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, దారిద్రరేఖకు దిగువ నున్న వారు మాత్రమే అర్హులన్నారు.

ఘనంగా ఎమ్మెల్సీ శివరామిరెడ్డి జన్మదినం

వజ్రకరూరు: మండలంలోని కొనకొండ్ల గ్రామంలో శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు భారీ కేక్ ను కట్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రామచంద్ర, సర్పంచు నంచర్ల ఇందిరమ్మ, ఎంపీటీసీలు పాపన్న, మునయ్య, ముద్దయ్య, మాజీ సర్పంచు పెద్దరాజు, నాయకులు తిప్పన్న, చుక్కా మల్లిఖార్జున, శ్రీరాములు, హనుమంతు, రవి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

కంబదూరు: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సీడీపీఓ వనజ అక్కమ్మ అన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాలలో భాగంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో పౌష్టికాహార ప్రాముఖ్యతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జ్యోతిలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా రాతిదూలం లాగుడు పోటీలు

రాయదుర్గం రూరల్: ఉగాది వేడుకల్లో భాగంగా మండలంలోని వడ్రహొన్నూరు గ్రామంలో శుక్రవారం రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించారు. పోటీలను ఎంపీటీసీ అరుణ్ కుమార్ ప్రారంభించారు. గ్రామానికి చెందిన బసప్ప గారి సచిన్ అనే రైతు ఎద్దులు రాతిదూలాన్ని 4,050 అడుగులు లాగి మొదటి స్థానం, గుల్లయ్య గారి రాజశేఖర్ ఎద్దులు 3,850 అడుగులు లాగి రెండోస్థానం, కాంబ్లి రవి ఎద్దులు 2,750 అడుగులు లాగి మూడోస్థానంలో నిలిచాయి. ప్రథమ, ద్వితీ, తృతీయ స్థానాల్లో నిలిచిన వృషభాల యజమానుల రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2.500 అందజేశారు. కార్యక్రమంలో 74 ఉడేగోళం సొసైటీ అధ్యక్షుడు భీమన్న, హనుమంతరెడ్డి, గొల్ల రాజ, ఎర్రిస్వామి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

లయన్స్ సేవలు అందరికీ ఆదర్శం

ఉరవకొండ: ఉరవకొండ లయన్స్ క్లబ్ సేవలు ఆదర్శంగా నిలుస్తున్నాయని ఆ క్లబ్ గవర్నర్ చంద్రప్రకాష్ కొనియాడారు. శుక్రవారం లయన్స్ గవర్నర్ అధికారిక పర్యటన ఉరవకొండలో నిర్వహించారు. స్థానిక ప్రభుత్వాస్పత్రి వద్ద రోగులతో పాటు పాదచారులు, వాహనచోదరులకు చలివేంద్రాన్ని క్లబ్ చైర్మన్ సప్తగిరిమల్లితో కలసి ఆయన ప్రారంభించారు. అనంతరం లయన్స్ క్లబ్ కార్యాలయంలో కుష్టు వ్యాధిగ్రస్తులకు క్లబ్ ఆధ్వర్యంలో వరుసగా రెండో నెల పౌష్టికాహార కిట్లను గరవర్నర్, వైద్యాధికారిణి డాక్టర్ సాహితి పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ సభ్యులు జోనల్ కార్యదర్శి కొమ్మసాని బాలచంద్ర, లక్ష్మీనారాయణ, నజీర్, గణేష్‌బాబు, నాగేశ్వరావు, పీజీఎస్ నూర్‌మహ్మద్, ఎంసీ నాగభూషణం, జయచంద్ర, సురేంద్ర, జీకెశ్రీధర్, చిట్టాశ్రీధర్, ప్రభాకర్‌నాయుడు, జాబీర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక

శెట్టూరు: జాతీయ ప్రతిభ అవార్డ్ పథకం కింద కేంద్రం ప్రభుత్వం అందించే (ఎన్‌ఎంఎంఎస్) స్కాలర్‌షిప్‌కు మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ గాయత్రి శుక్రవారం తెలిపారు. పాఠశాలలో 8 వతరగతి చదువుతన్న బీకే జశ్వంత్, ఆర్ కిరణ్ ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో ప్రతిభ కనబరిచారన్నారు. వీరికి ప్రతి ఏటా కేంద్ర ప్రభుత్వం రూ.12 వేల స్కాలర్‌షిప్‌ను అందించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. శుక్రవారం పాఠశాలలో ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు ఉపకార వేతనానికి ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

కర్ణాటక మద్యం పట్టివేత

రాయదుర్గం: రాయదుర్గం సెబ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో రామయ్యగారి గంగప్ప, బోయ లక్ష్మి, బోయ సోమశేఖర్ కర్ణాటక మద్యం తీసుకువస్తూ శుక్రవారం పట్టుబడ్డారని సీఐ జయనాథ్‌రెడ్డి తెలిపారు. వారి నుంచి 90 ఎంఎల్ కలిగిన 768 టెట్రా పాకెట్లు, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచామన్నారు. ఎస్ఐ హరికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.